బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ గురువారం 05 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## గవర్నర్ ప్రిన్సిపల్ కార్యదర్శిగా దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీగా దాన కిశోర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న బుర్రా వెంకటేశం వీఆర్ఎస్ తీసుకోవడంతో ఖాళీ ఆయన స్థానంలో దాన కిశోర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా దాన కిశోర్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం గూగుల్ కంపెనీతో కీలక ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌లో దేశంలోని మొట్టమొదటి గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్(జీఎస్ఈసీ)ని నెలకొల్పేందుకు గూగుల్ కంపెనీ ముందుకొచ్చింది. హైదరాబాద్‌లో స్థాపించే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ప్రపంచంలోనే అయిదవది. ఏషియా పసిఫిక్ జోన్‌లో టోక్యో తర్వాత ఏర్పాటు చేస్తున్న రెండో సెంటర్ ఇదే.

జీఎస్ఈసీ ప్రత్యేకమైన అంతర్జాతీయ సైబర్ సెక్యూరిటీ హబ్. ఇది అధునాతన భద్రత మరియు ఆన్‌లైన్ భద్రతా ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అత్యాధునిక పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత భద్రత, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, పరిశోధకులకు ఈ సేఫ్టీ సెంటర్ సహకార వేదికగా పనిచేస్తుంది.దేశంలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించి, ఉపాధి పెంచడం, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలు పెంపొందించే లక్ష్యంగా ఈ సెంటర్ పని చేస్తుంది.ఇప్పటికీ భారీ సంఖ్యలో ఉద్యోగులున్న గూగుల్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్‌లో నిర్మిస్తోంది.

ఈ ఏడాది అక్టోబర్ 3న జరిగిన గూగుల్ ఫర్ ఇండియా 2024 కాన్‌క్లేవ్‌లోనే సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు విషయాన్ని ఆ కంపెనీ ప్రకటించింది. అప్పటి నుంచి జీఎస్ఈసీని తమ రాష్ట్రంలోనే నెలకొల్పాలని, గూగుల్ పెట్టుబడులను ఆహ్వానించేందుకు వివిధ రాష్ట్రాలు పోటీ పడ్డాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన సందర్భంగా గూగుల్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. అప్పటి నుంచి హైదరాబాద్‌లో ఈ అత్యాధునిక సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపింది.

హైదరాబాద్‌లో ఈ సేఫ్టీ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు గూగుల్ ముందుకు రావటం చాలా ఆనందంగా, గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. గూగుల్‌తో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్య ఒప్పందం చేసుకోవటంతో మరోసారి హైదరాబాద్ ప్రపంచంలో మేటీ ఐటీ, ఇన్నోవేషన్ హబ్‌గా అందరి దృష్టిని ఆకర్షిస్తుందని అన్నారు. గూగుల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ రాయల్ హాన్సెన్ గారి అధ్వర్యంలోని కంపెనీ ప్రతినిధి బృందం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా హాన్సెన్ మాట్లాడుతూ.. డిజిటల్ స్కిల్ డెవలప్‌మెంట్‌లో తెలంగాణ ముందంజలో ఉందని అన్నారు. 'ప్రపంచ వ్యాప్తంగా ఐటీ, ఐటీ ఇంజనీరింగ్ సర్వీసెస్ అభివృద్ధికి హైదరాబాద్ కేంద్రంగా ఉంది. ఇప్పటికే ప్రపంచంలో పేరొందిన 5 టెక్ కంపెనీలు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఆపిల్, అమెజాన్, ఫేస్‌బుక్ ఇక్కడే ఉన్నాయి. ఇప్పుడు సేఫ్టీ సెంటర్ ద్వారా స్థాయిలో సైబర్ సేఫ్టీ సమస్యలను వేగంఆ పరిష్కరించే వీలుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సెంటర్ ఏర్పాటుతో వేల సంఖ్యలో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

## బొటానికల్ గార్డెన్‌లో ఎకో టూరిజం ప్రాజెక్టును ప్రారంభించిన సీఎం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

"ప్రజా పాలన - ప్రజా విజయోత్సవాలు"లో భాగంగా తెలంగాణ అటవీశాఖ కోట్ల విజయ భాస్కర్ రెడ్డి బొటానికల్ గార్డెన్ లో నిర్వహించిన కార్యక్రమం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సాలు సీఎం చేశారు. ఫారెస్ట్ అండ్ ఎకో టూరిజం డెవలప్ మెంట్ ఆఫీస్ కు శంకుస్థాపన చేశారు. కొత్తగూడెం - పాల్వంచ డివిజనల్ మేనేజర్ ఆఫీస్ కాంప్లెక్స్, సత్తుపల్లి డివిజనల్ మేనేజర్ ఆఫీస్ కాంప్లెక్స్ లను వర్చువల్ గా సీఎం ప్రారంభించారు. వృక్ష పరిచయ క్షేత్రం ప్రారంభం. వర్చువల్ వైల్డ్ లైఫ్ సఫారీ, ఎఆర్ విఆర్ బిల్డింగ్ ప్రారంభం, తెలంగాణ ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ నూతన వాహనాలను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి.



# మహిళలను ప్రగతి పథంలో నడిపించడమే ఎజెండా

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- పెద్దపల్లి యువ వికాసం సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- దాదాపు రూ.1035 కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపనలు
- గ్రూప్-4లో ఎంపికైన వారికి ఉద్యోగ నియామకపత్రాలు అందజేత

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమైన నిరుద్యోగ సమస్య పరిష్కారం, రైతాంగానికి అండగా నిలవడం, మహిళలను ప్రగతి పథంలో నడిపించడమే ఎజెండాగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వివరించారు. సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూనే మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి సమగ్రంగా వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోపు 55,143 ఉద్యోగ నియామకాలు పూర్తిచేసిన నేపథ్యంలో ప్రజా ప్రభుత్వం ప్రజా విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా అశేష జనవాహిని మధ్యన పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం సభలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

ఈ వేదికగా.. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్ 4 కేటగిరీ కింద కొత్తగా ఎంపికైన 8,084 మందికి, సింగరేణి సంస్థలో నియమితులైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను లాంఛనంగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించారు. పెద్దపల్లి జిల్లాలో దాదాపు 1035 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వర్చువల్ గా ప్రారంభించారు.

స్కిల్స్ యూనివర్సిటీతో కలిసి పని చేయడానికి సంబంధించి 7 ఏజెన్సీలతో ఇదే వేదికగా ముఖ్యమంత్రి సమక్షంలో ఒప్పందాలు కుదిరాయి. అలాగే, అత్యంత కీలకమైన Digital Employment Exchange of Telangana #DEET% ఏర్పాటును ముఖ్యమంత్రి ప్రారంభించారు. అలాగే సీఎం కప్-2024 ట్రోఫీని ఆవిష్కరించారు.

అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించిన ముఖ్యమంత్రి ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. గడిచిన పదేండ్లలో అభివృద్ధికి నోచుకోని ఎన్నో కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఉండగా, కోటి మందిని చేర్చి ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసేవరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. కోటి మంది ఆడబిడ్డలు ఓటేస్తే మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాతవాహన వర్సిటీకి ఇంజినీరింగ్, లా కాలేజీలు మంజూరు చేస్తామని ప్రకటించారు. తెలంగాణ ఉద్యమమే ఉద్యోగ ఉపాధి సాధన కోసం జరిగిన నేపథ్యంలోనే అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే శాఖల వారిగా మొత్తం 55,143 ఉద్యోగ నియామకాలు చేసి దేశంలోనే తెలంగాణ రికార్డు నెలకొల్పిన విషయాన్ని వివరించారు.

ప్రభుత్వ ఫలాలు సక్రమంగా అందాలని, బీసీలకు సరైన వాటా దక్కాలన్న ఉద్దేశంతోనే కులగణన చేపట్టినట్టు తెలిపారు. నిరుపేదల బిడ్డల చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలన్న ఉద్దేశంతోనే పదేళ్లుగా పెంచని డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచామని గుర్తుచేశారు. కరీంనగర్ జిల్లా శాతవాహన యూనివర్సిటీకి ఒక ఇంజనీరింగ్, ఒక లా కాలేజీ మంజూరు చేస్తామని చెప్పారు. పెద్దపల్లిలో సాగునీటి ప్రాజెక్టు, రామగుండంలో విద్యుత్ ప్రాజెక్టు సాధించడం ప్రజా విజయంగా అభివర్ణించారు. కాళేశ్వరం నుంచి చుక్కనీరు వినియోగించకుండా రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో 1.53 కోట్ల మెట్రిక్ టన్నుల వడ్లు పండించి చరిత్ర రికార్డు సాధించాం. ధాన్యానికి కనీస మద్దతు ధరతో పాటు సన్నాలకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నాం.గత ప్రభుత్వం చెల్లించని రైతు బంధు 7500 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమచేశాం. తొలి సంవత్సరంలో 21 వేల కోట్లతో 25 లక్షల రైతులకు రుణమాఫీ చేసిన చరిత్ర సృష్టించాం. నిర్భందాల మధ్య సాగిన పదేండ్ల పాలన నుంచి స్వేచ్ఛ కల్పించామని పలు సందర్భాలు, సంఘటనలను ఉదహరించారు. ఒక్కరోజులో ఎవరూ అద్భుతాలు సృష్టించరని, ప్రజలు ఇచ్చిన అవకాశం మేరకు సంక్షేమం, అభివృద్ధి రెండింటిపైనా దృష్టి సారించి ముందుకు సాగుతున్నట్టు ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ ఇస్తామని సోనియా మొదట ఈ గడ్డ పైనుంచే చెప్పారని, ఎన్ని అవాంతరాలు వచ్చినా ఆమె ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల ఆశీస్సులతోనే సామాన్యుడినైన తాను సీఎం అయ్యారని తెలిపారు.


ఉద్యోగాలపై మాట్లాడాలని మోదీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. వడ్లు పండించమని చెప్పామని, అందుకే మద్దతు ధర, బోనస్ ఇస్తున్నామని సీఎం చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, పొన్నం ప్రభాకర్ గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, ఎంపీ గడ్డం వంశీ గారు, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ గారు, స్థానిక పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు గారితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన గౌరవ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పెద్దపల్లికి వరాల జల్లు

పెద్దపల్లిలో యువ వికాసం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతూ ముఖ్యమంత్రి రేవంత్ ఆ జిల్లాకు వరాలు కురిపించారు.. పెద్దపల్లికి రూరల్ పోలీసు స్టేషన్, మహిళా పోలీసు స్టేషన్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ను మంజూరు చేశారు. ఎలిగేడు మండల కేంద్రానికి పోలీసు స్టేషన్, వ్యవసాయ మార్కెట్ను మంజూరు చేశారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిని 100 పడకలకు పెంచేం దుకు అనుమతి ఇచ్చారు. మంథనిలో 50 పడకల ప్రభుత్వా సుపత్రి నిర్మాణానికి ఉత్తర్వులు జారీ చేశారు. గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. పెద్దపల్లికి 4 వరుసల బైపాస్ రోడ్ మంజూరు చేశారు. అలాగే పెద్దపల్లి బస్సు డిపోను కూడా మంజూర చేసేశారు రేవంత్.

## తెలుగు రాష్ట్రాల్లో భూ ప్రకంపనలు

- భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 5.3గా నమోదు
- మేడారంలో భూకంప కేంద్రం గుర్తింపు




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలుగు రాష్ట్రాల్లో బుధవారం పలుచోట్ల స్వల్ప భూ ప్రకంపనలు వచ్చాయి. ఉదయం 7.27 గంటలకు కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురై, ఇళ్ల నుంచి పరుగులు తీశారు. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.3గా నమోదైంది. 55 ఏళ్ల తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఈ స్థాయిలో భూకంపం వచ్చిందని హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్ - ఎన్‌జీఆర్ శాస్త్రవేత్తలు తెలిపారు. భూకంప కేంద్రం నుంచి 225 కిలో మీటర్ల పరిధిలో ప్రకంపనల ప్రభావం కనిపించింది. తెలంగాణలలోని హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఉమ్మడి ఖమ్మం, రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల పరిధిలో భూమి కంపించింది. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం, జగ్గయ్యపేట, ఏలూరు, నందిగామ సహా పలు ప్రాంతాల్లో భూ ప్రకంపనలు వచ్చాయి.

హైదరాబాద్‌లో బుధవారం ఉదయం 7:27 గంటల సమయం భూకంపం సంభవించింది. దాంతో కొన్ని ప్రాంతాల్లో ఇండ్ల నుంచి ప్రజలు బయటకు పరిగెత్తారు. అయితే సెకన్ల పాటే భూమి కంపించడంతో చాలా మందికి భూ కంపం వచ్చినట్టు తెలియలేదు. నగరంలోని హిమాయత్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, మధురానగర్, సరూర్‌నగర్, లాలాపేట్ సూరారం, అబ్దుల్లాపూర్‌మెట్ హయత్ నగర్ యూసఫ్‌గూడా, బి.యన్.రెడ్డినగర్, ఉప్పల్, మేడ్చల్, ఖైరతాబాద్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో సెకండ్ల పాటు భూమి కంపించింది. కొన్ని ఇండ్లలోని వస్తువులు కింద పడిపోయాయి. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరలయ్యాయి.ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు, హనుమకొండతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, చింతకాని, చర్ల, ఇల్లెందు, నాగులవంచ ప్రాంతాల్లో భూమి కంపించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 3 సెకన్ల పాటు భూ ప్రకంపనలు వచ్చినట్లు స్థానికులు తెలిపారు.

## తెలంగాణ తల్లి రూపం మార్చొద్దు

**మళ్లీ అధికారంలోకి వస్తాం.. రాజీవ్ విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతాం**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మూర్తీభవించిన స్త్రీగా తెలంగాణ తల్లిని కేసీఆర్ రూపొందించారని, ఆయన మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మారిస్తే చరిత్ర క్షమించదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

"అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. నాడు ఇందిరాగాంధీ ప్రతిష్ఠించిన భరతమాత రూపాన్ని వాజ్‌పేయి అధికారంలోకి రాగానే మార్చలేదు. దేశంలో ఎన్నోచోట్ల అధికార మార్పిడి జరిగింది. తెలుగుతల్లి విగ్రహ రూపం మారలేదు. కన్నడమాత విగ్రహం రూపు మారలేదు. కానీ, ఈ ముఖ్యమంత్రి.. కేసీఆర్ మీద కోపంతో తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నాలుగేళ్ల తర్వాత రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టిన స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తాం. అధికారం ఉందని సాయుధ బలగాల నడుమ మీ నాటకాలు కొంతకాలం సాగుతాయి. కానీ, ఎల్లకాలం ఇదే పరిస్థితి ఉండదు" అని కేటీఆర్ హెచ్చరించారు.

ఏడాదిలోనే రేవంత్ రెడ్డి చేసిన డ్రామాలు ప్రజలకు తెలిసిపోయాయి అన్నారు. ఇప్పుడు సీఎం తన తప్పులను దాచుకోవడానికి అప్పుల కథను మరోసారి తెరమీదకు తీసుకొచ్చారంటూ మండిపడ్డారు. తెలంగాణలో జరగాల్సింది అప్పుల చర్చ కాదు, చేసిన తప్పులపై చర్చ అన్నారు. సీఎం పదవిలో ఉన్న పరువు పూర్తిగా తగ్గిపోయిందంటూ సెటైర్లు వేశారు.

'తెలంగాణ అంటే కెసిఆర్, అదే శ్రీరామరక్ష. దేశవ్యాప్తంగా సామాజిక మాధ్యమాల ద్వారా పనిచేస్తున్న వారందరికీ ధన్యవాదాలు. గత సంవత్సరం ప్రభుత్వం అరాచకాలు, అక్రమాలు, స్కాంలపై ప్రజల తరఫున పోరాడిన పార్టీ నేతలకు, కార్యకర్తలకి అభినందనలు. 11 నెలల పాలనలో లాభపడింది అనుముల సోదరులకే. కేవలం 11 నెలల్లోనే రాష్ట్రానికి 1000 కోట్ల రూపాయలు ఖర్చు చేసే స్థాయికి ఎదిగారు. ఈ పరిస్థితి ఉంటే వచ్చే ఏడాదికి "ఫోర్బ్స్ జాబితా"లో రేవంత్ సోదరుల పేర్లు ఉంటాయేమో'.'రాష్ట్రం దివాళా తీసిందని సీఎం చెబుతున్నారు. కానీ అసలు నిజం రిజర్వ్ బ్యాంక్, సోషల్ ఎకనామిక్ సర్వే రిపోర్టుల్లో ఉంది. రాష్ట్ర ఆదాయం అభివృద్ధికి వెచ్చించబడుతోంది. ప్రభుత్వ నిధుల గురించి అబద్ధాలు చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవగాహన లేకుండా వ్యవహరిస్తోంది. రైతు రుణమాఫీ, రుణ హామీలు అన్నీ కేవలం మాటలకే పరిమితం అయ్యాయి. భట్టి విక్రమార్క చెబుతున్నట్లుగా, రాష్ట్రంలోని రైతులకు కనీసం రూ.11,000 కూడా అందలేదు. ఇదే నిజమైన రుణమాఫీనా?"గురుకులాలకు సరైన నిర్వహణ చేయడంలో విఫలమైన ప్రభుత్వం, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసింది. విద్యార్థులపై కుట్ర కేసులు పెట్టడం ద్వారా ప్రజా విద్యా వ్యవస్థను పక్కదారి పట్టించుతున్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కల్పించకుండా, ఉన్న పరిశ్రమలను దెబ్బతీసి, కొత్త పరిశ్రమలు తీసుకురావడంలో విఫలమయ్యారు. ప్రభుత్వ హామీలపై విస్మరించిన కాంగ్రెస్ నేతల వైఖరి ప్రజలను తీవ్రంగా నిరాశపరుస్తోంది. సీఎం చెప్పే అప్పుల లెక్కలకూ, రిజర్వ్ బ్యాంక్ చెబుతున్న లెక్కలకూ పొంతన లేదు. 11 నెలల్లో లక్ష కోట్ల అప్పు తెచ్చి అభివృద్ధి లేకుండా చేసిన ఈ ప్రభుత్వం మోసం చేస్తోందని ప్రజలు స్పష్టంగా చూస్తున్నారు. ప్రభుత్వ ఖజానా ఎటు వెళ్తోందో సీఎం వివరణ ఇవ్వాలి' అని అన్నారు.

## 9 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 9వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ సమావేశాల్లో పలు అంశాలు చర్చించనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై అధికారికంగా ప్రకటన వెలువడినా ఎన్ని రోజులు సమావేశాలు నిర్వహిస్తారనేది ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న బీఏసీ సమావేశంలో నిర్ణయం ఉంటుంది.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తైన నేపథ్యంలో.. ఈ అసెంబ్లీ సమావేశాలు మరింత రసవత్తరంగా మారే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన, రుణమాఫీ, హైడ్రా, మూసీ ప్రక్షాళన, రైతు భరోసా వంటి కీలక అంశాలపై చర్చ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇక ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం.. గురుకుల పాఠశాల్లో ఫుడ్ పాయిజన్ కేసులు, లగచర్ల ఘటన, రైతు భరోసా, బోనస్ వంటి అంశాలపై చర్చకు పట్టుపట్టే అవకాశం కనిపిస్తోంది.

ఇక జనవరి సంక్రాంతి తరువాత రైతు భరోసా



వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. అయితే అందుకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై ఏర్పాటైన మంత్రి వర్గ ఉపసంఘం కూడా ఇప్పటికే పలు అంశాలతో కూడిన నివేదిక సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశాలను అసెంబ్లీలో చర్చించి రైతు భరోసా అర్హులైన రైతులకే దక్కేట్లు ముందుకు వెళ్లాలని ప్రభుత్వం యోచిస్తోంది. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ బిల్లును సైతం ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొత్తగా తీసుకురానున్న ఆర్వోర్ చట్టంతోపాటు, రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న కులగణన సర్వే ద్వారా వచ్చే గణాంకాలను అసెంబ్లీలో పెట్టి చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.

## హైకోర్టులో హరీశ్‌రావు క్వాష్ పిటిషన్




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు పిటిషన్‌లో పేర్కొన్నారు. పంజాగుట్ట పీఎస్‌లో తనపై తప్పుడు కేసు నమోదు చేశారని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాజకీయ దురుద్దేశంతో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారని ఆయన తెలిపారు. తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్‌పై ముందుకు వెళ్లకుండా స్టే ఇవ్వాలని కోర్టును కోరారు. సిద్దిపేట కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హరీశ్‌రావుపై కేసు నమోదైన సంగతి తెలిసిందే.

# ఏటీసీతో ఉపాధి అవకాశాలు మెరుగు..



- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ , రుద్రంగి**

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ) ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు . రుద్రంగి మండల కేంద్రానికి మంజూరి అయిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ కోసం బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి స్థల పరిశీలన చేశారు. అనంతరం స్థానిక అయ్యప్ప స్వామి వారి ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రుద్రంగి మండల కేంద్రంలోని కేజీబీవీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఏవైనా సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్లేగ్రౌండ్ సరిగా లేదని వారు చెప్పగా, ఆటస్థలం చదును చేయాలని ఆటలకు కావలసిన సామాగ్రిని అందించాలని ఎంపీడీవోకు కలెక్టర్ సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంత తవ్వాలని,త్వరలోనే విద్యార్థులకు సోలార్ హీటర్ వస్తుందని అన్నారు . అనంతరం క్లాస్ రూమ్లను పరిశీలించి స్మార్ట్ క్లాసులో పనితీరును పరిశీలించారు. పాఠశాలలో హిందీ టీచర్ లేరని తెలుసుకొని వెంటనే భర్తీ చేయాలని డీఈ వోను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులతో పలు పాఠ్యాంశాలు చదివించారు. అనంతరం వంటశాలలో బియ్యం, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయాలని నిర్వాహకులకు సూచించారు. మెనూ పరిశీలించి దానికి అనుగుణంగా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఇక్కడ వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.






## అక్రమ ఇసుక రవాణాకు బాధ్యులైన ఇద్దరు అరెస్టు

- **రిమాండ్‌కు తరలింపు**
- **అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవు : ఎస్సై గణేష్**

**బలగం టీవీ, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా మంగళవారం రాత్రి అక్రమ ఇసుక తరలిస్తుండడంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని ఎస్ఐ గణేష్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం పోతుగల్ తండాకు చెందిన రమావత్ రాజు అనే డ్రైవర్ సేవాలాల్ తండకు చెందిన లకావత్ అరుణ్ ట్రాక్టర్ లో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తూ పట్టుపడ్డారు. వీరిని బుధవారం రోజు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.




## బ్రిడ్జి పూర్తి నిర్మాణానికి మోక్షం ఎప్పుడు ?

**బలగం టీవీ , బోయినిపల్లిబీ**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయిన్పల్లి మండలం స్తంభంపల్లి గ్రామ సమీపాన చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వాల అలసత్వాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లకు సరైన సమయంలో బిల్లులు విడుదల చేయకపోవడం వల్ల ఈ అభివృద్ధి కార్యక్రమం చేపట్టిన కాంట్రాక్టర్లు ఇప్పుడున్న పరిస్థితులలో ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవరిస్తూ త్వర తగితన బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా చూడాలని పత్రిక ముఖంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# న్యాస్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా విద్యాధికారి



**బలగం టీవీ , బోయినిపల్లిబీ**

బోయినిపల్లి మండలం.ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న న్యాస్ (నేషనల్ అర్చివ్మెంట్ సర్వే) పరిక్ష సెంటర్ ను బోయినిపల్లి మండల కేంద్రములోని ఆనంద్ విద్యా నికేతన్ హై స్కుల్ నందు నిర్వహించగా జిల్లా విద్యాదికారి బి. జగన్ మోహన్ రెడ్డి పరిక్ష కేంద్రంను సందర్శించారు. ఈ న్యాస్ విద్యా ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నయో తెలుసుకొనుటకు విద్యా ప్రమాణాలను గుర్తించి తదనుగునంగా బోధన పద్ధతి మార్పులు నూతన ఆవిష్కరణ అంశములపై నూతన ఆలోచనలు వివిధ నైపుణ్యాల అభివృద్ధి మెరుగు పరుచుట కొరకు ఈ న్యాస్ పరీక్షలను చేయడం జరుగుతుంది. ఈ రోజు మన రాజన్న సిరిసిల్లా జిల్లాలో 85 పాఠశాలలలో 95 శాంపిల్ తరగతులను తీసుకొని విద్యార్ధుల సామర్ధ్యాలను పరిక్షించడం జరిగింది. దీనితో పాటు ఉపాధ్యాయుల ప్రశ్నావళి, విద్యార్ధులు ప్రశ్నావళి మరియు పాఠశాలల స్దితిగతుల ప్రశ్నావలి ఎన్.సి.ఈ.ఆర్.టి మార్గదర్శాలకు అనుగునంగా ఈ న్యాస్ (పరాక్ ) పరీక్షలను నిర్వహించడం జరుగింది. ఆయన వెంట మండల విద్యాధికారి ఎన్. శ్రావణ్ కుమారు గారు పాఠశాల కరస్పాండెంట్ బిల్ల ఆనందం మరియు అబ్జర్వర్ బాలరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

## మధ్యవర్తం వహిస్తూ, డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవు..

- **చందుర్తి సీఐ జి వెంకటేశ్వర్లు**

**బలగం టీవీ , చందుర్తి**




భూమి పట్టా చేపిస్తానని చెప్పి పలుమార్లు డబ్బులు వసూలు చేసిన రుద్రంగి గ్రామానికి చెందిన గుగ్గిళ్ళ తిరుపతి,పై కేసు నమోదు చేసినట్లు చందుర్తి సీఐ జి వెంకటేశ్వర్లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చందుర్తి సీఐ జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతంలో కూడా శీలం పద్మ,శీలం హనుమక్క మధ్యన వారసత్వం గా వచ్చిన భూమి వివాదంలో ఉన్నది. గుగ్గిళ్ళ తిరుపతి శీలం పద్మను లక్ష రూపాయలు ఇస్తేనే నీ పేరు పై భూమి రిజిస్ట్రేషన్ చేపిస్తానని, లేదంటే భూమి నీకు రాకుండా చేస్తానని బెదిరించాగా, రుద్రంగి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయిందని ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా మధ్యవర్తిత్యం లేదా పెద్దమనిషి గా వ్యవహరించి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని, గుగ్గిళ్ళ తిరుపతి బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్లో ,లేదా సర్కిల్ కార్యాలయం లో నేరుగా ఫిర్యాదు చేయాలని తెలిపారు.



## సీఎం కప్ 2024 క్రీడా ఆటల పోటీలు

**బలగం టీవీ , బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.సీఎం కప్ - 2024 క్రీడా పోటీలకు గాను ఎస్ వినోద్ సీఈవో,జడ్.పి.పి. రాజన్న సిరిసిల్ల (మండల ప్రత్యేక అధికారి) అధ్యక్షతన మండల లెవెల్ కమిటీ మీటింగ్ మండల పరిషత్ లో ఏర్పాటు చేయడం జరిగినది. క్రీడా పోటీలకు గ్రామ పంచాయతీ స్థాయి డిసెంబర్ 7 మరియు 8, మండల స్థాయి తేది 10 నుండి 12 న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ మరియు యోగా పోటీలు నిర్వహిస్తామని ఎస్ వినోద్, సీఈవో జడ్.పి.పి. రాజన్న సిరిసిల్ల (మండల ప్రత్యేక అధికారి) తెలిపినారు.ఇట్టి ఆటలకు వయస్సు: 14 సం.రాల నుండి 36 సం.రాల లోపు గల యువతి, యువకులు పాల్గొనవచ్చని మరియు ఇట్టి ఆటల పోటీలు విజయవంతముగా పూర్తి చేయుటకు అందరు పాలు పంచుకొవాలని తెలిపినారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జయశీల, ఎంఈఓ శ్రవణ్ కుమార్, ఎస్సై పృథ్వీరాజ్ గౌడ్, మరియు పీడీలు, పిఈటిలు హాజరైనారు.

## కాంగ్రెస్ సిరిసిల్ల యువజన నియోజకవర్గ అధ్యక్షుడిగా చుక్క రాజశేఖర్ ఎన్నిక

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**

సిరిసిల్ల యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షునిగా తంగళ్ళపల్లి మండలానికి చెందిన చుక్క రాజశేఖర్ ఎన్నికయ్యారు. ముస్తాబాద్ కు చెందిన తన సమీప ప్రత్యర్థి మహేష్ రెడ్డి పై పదిహేను వందల మెజార్టీతో చుక్క రాజశేఖర్ గెలుపొందారు. ఈ సందర్భంగా చుక్కా రాజశేఖర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు తన వంతు కృషి చేస్తానని తెలిపారు .



## యువ వికాస సభకు బయలుదేరిన కాంగ్రెస్ నాయకులు

**బలగం టీవీ , బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలోని 23 గ్రామాల నుండి పెద్దపల్లిలో జరిగే యువ వికాస నిరుద్యోగ విజయోత్సవ సభకు అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, ప్రజలు పెద్దపల్లికి బయలుదేరినారు.



## ఉద్యోగం సాధించని యువత స్వయం ఉపాధితో ముందుకు పోవాలి..

- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

**బలగం టీవీ , వేములవాడ**


యువత పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతూ ఉద్యోగం సాధించని తరుణంలో స్వయం ఉపాధిలో ముందుకు పోవాలి అని, ఎస్టి ఎస్సి బీసీలకు ఆయా సంక్షేమ శాఖల ద్వారా రుణాలు అందించే ప్రక్రియ ప్రభుత్వం చేపడుతుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఆది శ్రీనివాస్ అన్నారు.బుధవారం వేములవాడ పట్టణంలో బై పాస్ రోడ్డులో పేపర్ ప్లేట్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై,ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ మారటి తిరుపతి అనే దివ్యాంగుడు ఒక పరిశ్రమను ఏర్పాటు చేయాలనిఆలోచనతోనే, తన కాళ్ళ మీద తను ఉండాలని నేడు పేపర్ ప్లేట్ల ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం జరిగిందిఅని అన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రెండు లక్షలకు రూ. 1,40,000 సబ్సిడీపై లోన్ తీసుకోని పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయడం జరిగిందని ,దివ్యాంగుడనే ఆలోచన రాకుండా మరొకరికి ఉపాధి కల్పిస్తూ తన కాల మీద తాను నిలబడడం జరిగిందని అన్నారు.ప్రజా ప్రభుత్వం సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా వేడుకల్లో భాగంగా పేపర్ ప్లేట్ పరిశ్రమను ప్రారంభం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.

ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళా తల్లులను కోటీశ్వరులు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని, ఆనాడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి మహిళలకు పావలాకే రుణాలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.ఇందిర మహిళ శక్తి పథకాన్ని వినియోగించుకొని మహిళలు వివిధ చిరు పరిశ్రమలు స్థాపించి ముందుకు పోతున్నారని అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించుకోవడం జరిగిందని అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ట్రాన్స్ జెండర్లకు దివ్యాంగులకు దేశంలో ఎక్కడ లేనివిధంగా ఒక పెట్రోల్ బంకును త్వరలోనే ప్రారంభం చేసుకోవడం జరుగుతుందని అన్నారు. దివ్యాంగులకు ప్రోత్సాహకం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందిని,ఇప్పటికే యువతకు 55 వేల ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని అన్నారు.యువత ముందుకు వస్తే స్వయం ఉపాధిలో రుణాలు మంజూరు చేయడానికి రాష్ట్ర

## రోడ్ల పైన ధర్నా చేసిన వ్యక్తులపై కేసు నమోదు

- చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదు : ఎస్సై గణేష్



**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో రోడ్లపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేసిన 14 మంది వ్యక్తులతో పాటు మరి కొంతమంది పై సిరిసిల్ల డి.ఎస్.పి చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై గణేష్ తెలిపారు. రెండు రోజుల క్రితం పోతుగల్ గ్రామంలో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో చేసి పోలీస్ విధులకు, ట్రాఫిక్కు ఇబ్బందులు గురి చేశారు. అలాగే ఆరు గ్రామంలో మహిళలు రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తాలకు చేసి ట్రాఫిక్కు అంతరాయం కలిగించినందున ఫోటోలో వీడియోల ఆధారంగా డి.ఎస్.పి ఆదేశాల మేరకు 14 మందితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. ఎవరైనా సరే చట్టాన్ని చేతిలోకి తీసుకొని రోడ్లమీద ధర్నాలు రాస్తారోకోలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## ప్లాస్టిక్ కవర్‌లో పసికందు తల



**బలగం టీవీ, సికింద్రాబాద్**

ఓ ప్లాస్టిక్ కవర్‌లో అప్పుడే పుట్టిన చిన్నారి తల మాత్రమే పడి ఉండటం సికింద్రాబాద్ కళాసీగూడలో కలకలం సష్టించింది. ఇన్ స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని కళాసీగూడలోని చంద్ర అర్కేడ్ కాంప్లెక్స్ మెట్ల పక్కన ప్లాస్టిక్ కవర్‌లో ఓ శిశువు తల మాత్రమే కనిపించింది. దాంతో స్థానికులు వెంటనే మహంకాళి పోలీసు లకు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు వచ్చి పరిశీలించగా అప్పుడే పుట్టిన శిశువు తలగా గుర్తించారు. పాపనా, బాబునా అనేది కూడా గుర్తించాల్సి ఉంది. అయితే ముఖంపై కుక్క గాట్లు ఉండటంతో పాటు సీసీ టీవీలో ఓ కుక్క ప్లాస్టిక్ కవర్‌ను పట్టుకుని వచ్చినట్టు దశ్యాలు కనిపించాయి. ఆ చిన్నారి పుట్టక ముందే చనిపోయిందా, చనిపోయిన తర్వాత ఎవరైనా బయట పడేస్తే కుక్క ఎత్తుకుని వచ్చే క్రమంలో తల, మొండెం వేరైందా, లేదా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఏదైనా దాచిపెట్టే యత్నం చేస్తున్నారా అనే దానిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం శిశువు తలను గాంధీ మార్చురీకి తరలించారు

# క్రీడలతోనే స్నేహం.. ఉల్లాసం..

- ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకే సీఎం కప్ పోటీలు..
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:**

క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకువచ్చేందుకే సీఎం కప్ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తున్నదని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా జిల్లాలో సీఎం కప్ పోటీల నిర్వహణపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తో కలిసి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు, జిల్లలో సీఎం క్యాంప్ 2024 క్రీడోత్సవాలు ఈ నెల 7 నుండి జనవరి 2 వరకు 36 ఈవెంట్స్ లో పోటీలు నిర్వహిస్తున్న సందర్భములో జిల్లా కమిటీ సభ్యులతో సమావేశామును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సీఎం కప్పును ఆయ గ్రామాలకు, మండలాలకు కేటాయించిన ఆటలను ఆయా క్రీడా ప్రాంగణాలలో విజయవంతముగా నిర్వహించాలని అన్నారు.జిల్లాలో ఉన్నటువంటి క్రీడ మైదానాలను ఉపయోగించుకొని జిల్లాకు కేటాయించిన వివిధ ఆటలను అడిపిస్తూ , అధనముగా టేబుల్ టెన్నిస్, క్యారం బోర్డ్, టైక్వాండో, కరాటే, పవర్ లిఫ్టింగ్, చెస్ వూషఉ మొదలగు ఆటలను కూడా ఆడిపించాలని అన్నారు . ఇందులో ప్రథమ, ద్వితీయ,మరియు తృతీయ బహుమతిలను కేటాయించి గోల్డ్, సిల్వర్ మరియు బ్రాంజ్ మెడల్స్ కూడా విజేతలకు అందచేయగలరని,అలాగే జిల్లా విద్య శాఖదికారిని ఇందుకు అవసరమగు పీడీ మరియు పిఈటీలను ఆయ ఈవెంట్ ల వారిగా జరుగు పోటీలకు అందించాలని ఆదేశించారు ఈ కార్యక్రమం లో యువజన అండ్ స్పోర్ట్స్ శాఖ అధికారి రాందాస్, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులకు భయపడేదే లేదు ఉద్యమ పార్టీలో ఉన్నాం



- అంధకారం కాదు అద్దమై ప్రతిభంబిస్తాం
- గుండు ప్రేమ్ కుమార్

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలంలోని ప్రెస్ క్లబ్ భవనంలో గుండు ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు అధికారం కట్టబెడితే కొందరు కాంగ్రెస్ నాయకులు ప్రజల కోసం పని చేయాల్సింది పోయి ప్రతిపక్ష నాయకుల్లా మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలకు పూనుకుంటున్నారని అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఇంకా ఉన్నారని బెదిరింపులకు గురి చేస్తే భయపడేది లేదని బి ఆర్ఎస్ అంటేనే ఉద్యమ పార్టీ అని మీకు చేతనైతే నేడు సిరిసిల్లలో చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సిరిసిల్లకు వచ్చినటువంటి యారన్ డిపోను వేములవాడకు తరలించి నేతన్నలకు ఉపాధి లేకుండా చేస్తున్నారని చేతనైతే వారికి ఉపాధి చూపించి సిరిసిల్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్ష ధోరణి లో మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు.వ్యక్తిగత విమర్శనాలకు పోకుండా ప్రజాస్వామ్యంలో ఉన్నాము కాబట్టి రాజ్యాంగబద్ధంగా ఉండాలని హెచ్చరించారు .అనంతరం నవీన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలన పేరిట దౌర్జన్య పాలన కొనసాగిస్తున్నారని కాంగ్రెస్ యువజన నాయకులు ప్రతిపక్ష నాయకుల్లా ప్రెస్ మీట్ లు పెట్టి మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ లేకుండా రుణమే మిగిలిందని, రైతుబంధు పూర్తిగా బంద్ అయ్యిందని స్కూటీలు షో రూమ్ లోనే ఉన్నాయని తెలంగాణ ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి తులం బంగారం తక్కళ్ల లోనె ఉందని ఎద్దేవా చేశారు. గురుకులాలలో ఇప్పటివరకు 43 మందిని పొట్టన పెట్టుకున్నారని కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షాల లాగా వ్యవహరించకుండా ప్రజా సమస్యల పైన దృష్టి సారించండని విమర్శలు ప్రతి విమర్శలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుండు ప్రేమ్ కుమార్, కడారి నవీన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,పవన్ రెడ్డి,జీవన్, నరేష్, పూర్ణచందర్,అఫ్రోజ్,రంగు తిలక్, కూతురి బాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కేసు నమోదు



**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బుధవారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో హల్‌చల్ చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అయితే ఆ సమయంలో సీఐ బయటకు వెళ్తుండగా తన ఫిర్యా దును స్వీకరించిన తర్వాత వెళ్లాలని కౌశిక్ రెడ్డి కోరారు. అయితే, అర్జెంట్ పని ఉందని.. తిరిగి వచ్చిన తర్వాత తీసుకుంటానని సీఐ చెప్పడంతో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు సీఐ వాహనాన్ని అడ్డుకుని నినాదాలు చేశారు. దాంతో సీఐ వెనక్కి వచ్చి ఫిర్యాదు పత్రం తీసుకున్నారు. ఈ క్రమంలో కాస్త ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాంతో తమ విధులను ఆటంకం కలిగించారని, బెదిరింపులకు పాల్పడ్డాడని ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర ఫిర్యాదు చేయగా కౌశిక్ రెడ్డి, అతని అనుచరుల మీద పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇదిలా ఉండగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన ఫోన్ ట్యాప్ అవుతోందని ఫిర్యాదు చేయడానికి బంజారాహిల్స్ ఏసీపీకి ఉదయాన్నే ఫోన్ చేస్తే మధ్యాహ్నం 3 గంటలకు రమ్మన్నారాని తెలిపారు. సాయంత్రం బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్ తాను వెళ్లేకన్నా ముందే ఏసీపీ వెళ్లిపోయారని, సీఐ కూడా వెళ్లి పోయేందుకు ప్రయత్నిస్తే కారును అడ్డుకొని ఫిర్యాదు స్వీకరంచాకే వెళ్ళాలని తమ పార్టీ కార్యకర్తలు సీఐ రాఘవేంద్రను కోరినట్టు చెప్పారు. అయితే ఎమ్మెల్యే అనే కనీసం గౌరవం లేకుండా సీఐ ప్రవర్తిం చారని.. రాష్ట్ర డీజీపీ కన్నా ఎక్కువ ప్రోటోకాల్ ఎమ్మెల్యేకు ఉంటుందని సీఐ కి తెలియదా? అని ప్రశ్నించారు. పదవులు లేని సీఎం సోదరులకు పోలీసులు వంగి వంగి దండాలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఓ స్నేహితుడి పార్టీకి వెళితే ఇంటెలిజెన్స్ ఐజీ శివధర్ రెడ్డి తన ఫోన్ ట్యాప్ చేసి.. అక్కడికి పోలీసులను పంపారని..తన దగ్గర డ్రగ్స్ పెట్టించి కేసు పెట్టించాలని శివధర్ రెడ్డి ప్రయత్నించారని ఆరోపించారు. సీఎం రేవంత్, శివధర్ రెడ్డి పై కేసు నమోదు చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. తమ నేత హరీశ్‌రావుపై బ్రోకర్‌లు కేసు పెడితే పోలీసులు ఎఫ్ఐఆర్ ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. సీఎం రేవంత్ దేవుళ్ళ మీద ఒట్లు వేయడం వల్లే రాష్ట్రం లో భూ కంపం వచ్చిందన్నారు. సీఎం పాపాల నుంచి ప్రజలను దేవుళ్ళే కాపాడాలన్నారు. నాలుగేండ్లలో తమ ప్రభుత్వమే వస్తుందని.. చట్ట విరుద్ధంగా ప్రవర్తిస్తున్న పోలీసులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఘటనపై సీఐ రాఘవేంద్ర మాట్లాడుతూ విధుల్లో ఉన్న పోలీసు అధికారులతో ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించడమే కాకుండా తాను బయటికి వెళ్ళకుండా వాహనం అడ్డు పెట్టారని తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు ఇతర నాయకులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

# ఆసియా కప్ సెమీస్‌కు భారత్..




- అండర్-19లో అదరగొడుతున్న భారత్
- యూఏఈ పై 10 వికెట్ల తేడాతో ఘన విజయం

**బలగం టీవీ, హైదరాబాద్**

అండర్-19 ఆసియా కప్‌లో భారత్ అదరగొడుతోంది. బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో యూఏఈ పై భారత్ 10 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది. 138 పరుగుల లక్ష్యాన్ని 16.1 ఓవర్లలోనే భారత్ ఛేదించింది. టీమ్ఇండియా బ్యాటర్లలో 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. 46 బంతులు ఎదుర్కొన్న అతడు 3 ఫోర్లు, 6 సిక్సర్లు బాది 76 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతడితో పాటు మరో ఓపెనర్ ఆయుష్ మాత్రే (67 నాటౌట్, 51 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో రాణించాడు.

టాస్ గెలిచిన యూఏఈ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. భారత బౌలర్ల ధాటికి 44 ఓవర్లలో 137 పరుగులకు కుప్పకూలింది. యూఏఈ బ్యాటర్లలో రాయన్ ఖాన్ (35, 48 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్. అక్షత్ రాయ్ (26), ఏతాన్ డిసౌజా (17), ఉద్దీష్ (16) లు మాత్రమే రెండు అంకెల స్కోరు చేయగా మిగిలిన అందరూ సింగిల్ డిజిట్‌కే పరిమితం అయ్యారు. భారత బౌలర్లలో యుదాజిత్ గుహా మూడు వికెట్లు తీశాడు. చేతన్ శర్మ, హార్దిక్ రాజ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆయుష్ మాత్రమే ఓ వికెట్ సాధించాడు.

# 10 ఏళ్లుగా ధోనీతో నాకు మాటల్లేవు




- హర్భజన్ సింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీతో తనకు గత 10 ఏళ్లుగా మాటలు లేవని మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తెలిపాడు. తమ మధ్య ఎలాంటి స్నేహం లేదని, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడినప్పుడు కూడా ఎక్కువగా మాట్లాడుకోలేదని చెప్పాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో భజ్జీ మాట్లాడారు.

'ధోనీతో నాకు మాటాల్లేవ్. మేం మాట్లాడుకోక 10 ఏళ్లు అవుతోంది. ధోనీతో నాకు ఎలాంటి సమస్య లేదు. అతనే నాతో మాట్లాడటం లేదు. నాతో మాట్లాడకపోవడానికి గల కారణం ఏంటో కూడా నాకు తెలియదు. సీఎస్‌కే తరఫున ఆడుతున్నప్పుడు మేం మాట్లాడుకున్నాం. కానీ మా మాటలు మైదానం వరకే పరిమితమయ్యేవి. అతను నా రూమ్‌లోకి రాలేదు. నేను కూడా అతని గదిలోకి వెళ్లలేదు. ధోనీతో నాకేం గొడవ లేదు. అతను ఏదైనా చెప్పాలనుకుంటే నాకు చెప్పగలడు. కానీ, ఏదైనా ఉంటే ఈ పాటికే చెప్పి ఉండేవాడు. నేనెప్పుడూ ధోనీకి ఫోన్ చేయను. నన్ను పట్టించుకోని వారితో ఎక్కువగా ఉండను. రిలేషన్ అనేది ఎల్లప్పుడూ ఇచ్చిపుచ్చుకోవడంపై ఆధారపడి ఉంటుంది.

మనం ఎదుటివారిని గౌరవిస్తే వారి నుంచి కూడా అదే ఆశిస్తాం. కానీ, ఎవరికైనా ఒకట్రెండుసార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోతే వారిని అవసరమైనప్పుడు మాత్రమే కలుస్తాను.' అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు. ధోనీ సారథ్యంలో హర్భజన్ సింగ్ సుదీర్ఘ కాలం ఆడాడు. ధోనీ సారథ్యంలో భారత్ గెలిచిన 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే ప్రపంచకప్ జట్లలోనూ హర్భజన్ సింగ్ కీలక సభ్యుడిగా ఉన్నాడు.



## "ఇంద్ర" పోస్టర్‌ను మార్చేసిన ఓదెల

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్ అనౌన్సమెంట్ తోనే భారీ హైప్ ని సొంతం చేసుకున్న సంగతి తెలిసింది. ఇదిలా ఉండగా శ్రీకాంత్ ఓదెల మాత్రం తన చిరకాల హీరో మెగాస్టార్ పై ఉన్న ప్రేమని ఓ రేంజ్ లో వ్యక్తం చేస్తున్నాడు. మెగాస్టార్ ఇండస్ట్రీ హిట్ "ఇంద్ర" సినిమాలో చిరు పోస్టర్ పక్కన చిన్ననాటి తేజ సజ్జ తొడగొట్టే షాట్ రెండిటిని కలిపి మొన్న ఇంద్ర రీ రిలీజ్ కి ఫ్యాన్స్ సూపర్ గా రెడీ చేశారు. ఆ చిన్నోడి చెయ్యి పట్టుకున్న మెగాస్టార్ ఫ్రేమ్ లా ఇది పవర్ఫుల్ గా కనిపిస్తుంది. ఇపుడు ఇదే పోస్టర్ లో చిరు పక్కన ఉన్న తేజ సజ్జ తల ప్లేస్ లో శ్రీకాంత్ ఓదెల ఉన్న పిక్ ని షేర్ చేయడం ఇపుడు ఫ్యాన్స్ లో మంచి ఎనర్జిటిక్ మూమెంట్ లా మారింది.

## 'రైడ్ 2' విడుదల వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం 'రైడ్'. సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. 'రైడ్ 2'లో కూడా అజయ్ దేవగణ్ హీరోగా నటిస్తుండగా.. రితేష్ దేశ్‌ముఖ్, వాణి కపూర్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. అయితే ఈ సినిమాను మొదట ఫిబ్రవరి 21 2025 మహాశివరాత్రి కానుకగా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ మూవీ విడుదల తేదీని ఫిబ్రవరి నుంచి మేకి వాయిదా వేశారు. ఈ సినిమాను మే 1న విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు. ఈ సినిమాకు రాజ్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా.. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్, క్రిషన్ కుమార్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.







## 'సీజ్ ద షిప్' టైటిల్ రిజిస్టర్

**బలగం టీవీ, హైదరాబాద్**

పనామ దేశానికి చెందిన ఒక షిప్‌లో అక్రమంగా విదేశాలకు తరలి వెళుతున్న రేషన్ బియ్యంను ఇటీవల కాకినాడ పోర్టులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్టుకుని సీజ్ చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే షిప్‌లో బియ్యాన్ని పట్టుకున్న అనంతరం పవన్‌కల్యాణ్ సీజ్ ద షిప్ అంటూ పలికిన విషయం తెలిసిందే. సినిమా లెవల్ ఎలివేషన్‌తో ఈ మాట అనడంతో సోషల్ మీడియా అంతటా ఆ డైలాగ్ బాగా వైరల్ అయ్యింది. పవన్ ఫ్యాన్స్ కూడా ఈ మాటను బాగా ట్రెండ్ చేశారు.

ఇదిలావుంటే తాజాగా సీజ్ ద షిప్ అనే టైటిల్‌ని తాజాగా రిజిస్ట్రేషన్ చేసుకుంది టాలీవుడ్‌కి చెందిన నిర్మాణ సంస్థ. తెలుగు ఇండస్ట్రీకి చెందిన ఆర్ ఫిలిం ఫ్యాక్టరీ.. సీజ్ ద షిప్ అనే టైటిల్‌ను రూ.1100లకు నమోదు చేసుకుంది. ఏడాది పాటు టైటిల్ హక్కులు వర్తించనున్నాయి.

# ఆదిత్య 369కు సీక్వెల్‌గా ఆదిత్య 999

**బలగం టీవీ, హైదరాబాద్**

నందమూరి బాలకృష్ణ నటించిన సూపర్ హిట్ చిత్రాల్లో 'ఆదిత్య 369'. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రం 1991లో విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. అయితే ఈ మూవీకి సీక్వెల్ ఉంటుందని, బాలయ్య గతంలోనే పలు సందర్భాల్లో చెప్పారు. ఆదిత్య 999 మ్యాక్స్ పేరుతో ఇది రానుందన్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన అన్‌స్టాపబుల్ సీజన్ 4 కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడారు.

"ఆదిత్య 369కు సీక్వెల్‌గా ఆదిత్య 999 రానుంది. మా అబ్బాయి మోక్షజ్ఞ తేజ హీరోగా యాక్ట్ చేస్తాడు. ప్రస్తుతం దీనికి సంబంధించిన పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ఇది పట్టాలెక్కనుంది. అన్నీ కుదిరితే 2025లోనే రిలీజ్ చేసే అవకాశం ఉంది" అని అన్నారు. కాగా, అన్‌స్టాపబుల్ లేటెస్ట్ ఫుల్ ఎపిసోడ్ డిసెంబర్ 6న ప్రసారం కానుంది. ఈ ఎపిసోడ్ ప్రారంభంలో ఆదిత్య 369 సినిమాకు సంబంధించిన గెటప్‌లో బాలయ్య స్టేజ్‌పై కనిపించి ఫ్యాన్స్‌ను అలరించారు.



## లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూలతలు మన మార్కెట్లపై సానుకూల ప్రభావాన్ని చూపించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 110 పాయింట్లు లాభపడి 80,956 వద్ద ముగిసింది. నిఫ్టీ 10 పాయింట్లు పెరిగి 24,467 వద్ద స్థిరపడింది.

బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్: హెచ్డీఎఫ్సీ బ్యాంక్ (1.82%), ఎన్టీపీసీ (1.41%), బజాజ్ ఫిన్ సర్వ్ (1.32%), టీసీఎస్ (1.25%), టైటాన్ (1.01%)

టాప్ లూజర్స్: భారతి ఎయిర్ టెల్ (-2.17%), టాటా మోటార్స్ (-1.61%), అదానీ పోర్ట్స్ (-1.53%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (-1.44%), మారుతి (-1.30%).